

కోలాటం.. సంబరం
తీరిక సమయంలో సెల్‌ఫోన్‌తో కాలక్షేపం చేయకుండా చాలా మంది చిన్నారులు కోలాటం నేర్చుకుంటున్నారు. పండుగలు, జాతర్లలో వీరు వేసే కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. 8లో▸



విద్యుత్‌ సమస్యలతో పరేషాన్‌
బనగానపల్లె సమీపంలోని రవ్వలకొండపై ఉన్న ఏపీ మోడల్‌ స్కూల్‌ బాలికల వసతి గృహానికి విద్యుత్‌ సరఫరా అస్తవ్యస్తంగా తయారైంది. దీంతో విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. 8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,624.80
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:75.837
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:1,01,537
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:94,488

న్యూస్‌రీల్‌

ఉరుకుందలో 8న వరలక్ష్మీ వ్రతం
కౌతాళం: ఉరుకుంద ఈరన్న (నరసింహ) స్వామి క్షేత్రంలో ఆగస్టు 8న శుక్రవారం వరలక్ష్మీ వ్రతం ఉదయం 9 గంటలకు చేపడుతున్నట్లు డిప్యూటీ కమిషనర్‌ మేడేపల్లి విజయరాజు తెలిపారు. దేవస్థాన తూర్పు రాజగోపురం ఎదుట లక్ష్మీ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. రూ. వెయ్యి చెల్లించి వ్రతంలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. వ్రతంలో పాల్గొనే ప్రతి మహిళకు దేవస్థానం పూజా సామగ్రి ఇస్తుందని చెప్పారు. శేషవస్త్రం, ఒక రవిక, గాజులు, పసుపు-కుంకుమ, తమలపాకులతో కూడిన కిట్‌ను దేవస్థానం తరఫున ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. ఆగస్టు 1న సుదర్శన హోమం, ఆగస్టు 18న సోమవారం స్వామివారి పల్లకీ ఉత్సవ సేవ, ఆగస్టు 19న రుద్ర హోమం ఉంటుందని తెలిపారు.

సిల్వర్‌జూబ్లీ కళాశాలలో అత్యుత్తమ బోధన



అలాట్‌మెంట్‌ పత్రాన్ని అందజేస్తున్న క్లస్టర్‌ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌ డాక్టర్‌ వెంకటేశ్వర్లు

కర్నూలు సిటీ: క్లస్టర్‌ యూనివర్సిటీ పరిధిలోని సిల్వర్‌జూబ్లీ డిగ్రీ ప్రవేశాల కౌన్సెలింగ్‌ బుధవారం ప్రారంభమైంది. వర్సిటీ రిజిస్ట్రార్‌ డాక్టర్‌ కట్టా వెంకటేశ్వర్లు, కాలేజీ ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ జి.శ్రీనివాస్‌ కౌన్సెలింగ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్‌ మాట్లాడుతూ సిల్వర్‌ జూబ్లీ కాలేజీలో చదివిన ప్రతి ఒక్కరూ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కించుకొని జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకున్నారన్నారు. కాలేజీలో అత్యుత్తమ విద్యార్హతలు కలిగిన అధ్యాపకులతో బోధన సాగుతోందన్నారు. విద్యార్థులకు క్రమ శిక్షణతో పాటు అత్యుత్తమ సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. సిల్వర్‌సెట్‌లో రెండో ర్యాంకు సాధించిన విద్యార్థి జాహ్నవికి రిజిస్ట్రార్‌, ప్రిన్సిపాల్‌ చేతుల మీదుగా సీటు కేటాయింపు పత్రాన్ని అందజేశారు. మొదటి రోజు 120 మంది విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరయ్యారన్నారు. ఒక్కో సీటుకు ముగ్గురు చొప్పున కౌన్సెలింగ్‌కు పిలిచామని సిల్వర్‌ సెట్‌ కన్వీనర్‌ డాక్టర్‌ వాయిజ్‌ తెలిపారు. గురువారం బీఏసీ విద్యార్థులకు కౌన్సెలింగ్‌ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కాలేజీ వైస్‌ ప్రిన్సిపాల్‌ జి.ప్రసాద్‌ రెడ్డి, అధ్యాపకులు ఎల్లా కృష్ణ, ఫామీదా బేగం, ఓబులేసు, రాజశేఖర్‌, నాగన్న, నరేంద్ర బాబు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీమఠంలో నంద్యాల జిల్లా కలెక్టర్‌



మంత్రాలయం రూరల్‌: శ్రీరాఘవేంద్ర స్వామి దర్శనార్థం బుధవారం నంద్యాల జిల్లా కలెక్టర్‌ రాజకుమారి మంత్రాలయానికి వచ్చారు. జిల్లా కలెక్టర్‌కు శ్రీమఠం అధికారులు స్వాగతం పలికారు. ముందుగా గ్రామ దేవత మంచాలమ్మకు అర్చన సహిత హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం రాఘవేంద్రుల మూలబృందావనాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు జిల్లా కలెక్టర్‌కు ఫలపూల మంత్రాక్షింతలతో ఆశీర్వచనం చేశారు.

ఈ-నామ్‌లో సమూల మార్పులు
కర్నూలు(అగ్రికల్చర్‌): ఈ-నామ్‌లో సమూలమైన మార్పులకు కేంద్రం చర్యలు చేపట్టింది. వ్యవసాయ మార్కెట్‌ కమిటీల్లో క్రయవిక్రయాలన్నీ ప్రస్తుతం ఈ-నామ్‌లోనే జరుగుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో 15 వ్యవసాయ మార్కెట్‌ కమిటీలు ఉండగా కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు మార్కెట్‌ల్లో దాదాపు అన్ని రకాల వ్యవసాయ ఉత్పత్తుల క్రయవిక్రయాలు చేపడుతున్నారు. పత్తికొండ మార్కెట్‌లో టమాట, నంద్యాలలో మిర్చి క్రయవిక్రయాలు మాత్రమే నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం అమలులో ఉన్న ఈ-నామ్‌ సేవలను 2.0 వర్షన్‌తో అమలు చేయడానికి చర్యలు చేపట్టినట్లు జిల్లా మార్కెటింగ్‌ శాఖ సహాయ సంచాలకులు నారాయణమూర్తి తెలిపారు. కొత్త వర్షన్‌తో ఈ-నామ్‌ ఈ ఏడాది సెప్టెంబర్‌ చివరి నుంచి అమలవుతుందన్నారు. ఈ-నామ్‌ కొత్త వర్షన్‌తో వేర్‌ హౌసింగ్‌ గోదాముల్లో కూడా వ్యవసాయ ఉత్పత్తుల క్రయవిక్రయాలు జరుపుకోవచ్చన్నారు. ఇప్పటి వరకు కర్నూలులో 2.0 వర్షన్‌పై శిక్షణా కార్యక్రమం పూర్తి అయిందని, గురువారం ఆదోనిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



పెట్టుబడి సాయం.. రైతుల్లో అయోమయం!

ఊరిస్తున్న 'అన్నదాత సుఖీభవ'

- అడ్డగోలు కోతలతో వేలాది మందికి మొండిచేయి
- 2023-24లో 2,94,598 మందికి వైఎస్సార్‌ రైతుభరోసా
- అన్నదాత సుఖీభవ 2,71,024 మందికే పరిమితం
- పెట్టుబడి సాయానికి నోచుకోని కౌలురైతులు
- పీఎం కిసాన్‌ లబ్ధిదారుల్లోనూ భారీగా కోత

కర్నూలు(అగ్రికల్చర్‌): అన్నదాత సుఖీభవ పథకం రైతులతో దోబూచులాడుతోంది. పెట్టుబడి కష్టాలతో అల్లాడుతున్న రైతులను కూటమి ప్రభుత్వం ఏడాది గడిచినా ఆదుకోలేకపోతోంది. ఇప్పటికే ఒక సంవత్సరం పెట్టుబడి సాయాన్ని ఎగ్గొట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబు.. తాజాగా ఆగస్టు 2వ తేదీన రైతుల ఖాతాల్లో జమ చేస్తామని చెప్పినా అన్నదాతల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇదే సమయంలో అర్హత కలిగిన రైతుల సంఖ్యను భారీగా కుదించడం ఆందోళన కలిగిస్తోంది. అర్హుల జాబితాలో పేర్లు లేని రైతులు ఆన్‌లైన్‌ ద్వారా గ్రీవెన్స్‌ అప్‌లోడ్‌ చేసుకునే అవకాశం కల్పిస్తున్నట్లు ప్రకటించినప్పటికీ చర్యలు నామమాత్రమే. 1418 గ్రీవెన్స్‌కు దిక్కే లేకుండా పోయింది. 2014 ఎన్నికల్లో రైతులు బ్యాంకుల నుంచి తీసుకున్న పంట రుణాలన్నింటినీ మాఫీ చేస్తామని చంద్రబాబు ప్రకటించారు. అయితే అరకొర రుణమాఫీతో మమ అనిపించారు. ఈ సారి కూడా అదే పరిస్థితి ఎదురవుతుందేమోనని రైతులు చర్చ జరుగుతోంది.

23,574 మంది రైతులకు మొండిచేయి

గత వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం 2023-24లో వైఎస్‌ఆర్‌ రైతుభరోసా కింద 2,94,598 మంది రైతులకు పెట్టుబడి సాయాన్ని అందించింది. కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ కింద తాజాగా అర్హత పొందిన రైతుల జాబితాలను విడుదల చేసింది. కర్నూలు జిల్లాలో పెట్టుబడి సాయానికి అర్హత పొందిన రైతులు 2,75,749 మంది మాత్రమే ఉన్నారు. 1,829 మంది రైతులతో ఈ-కేవైసీ చేయించడంలో వ్యవసాయ శాఖ విఫలమైంది. అన్నదాత సుఖీభవ కింద అర్హత పొందినప్పటికీ ఈ-కేవైసీ తిరస్కరణకు గురికావడంతో 2,896 మంది రైతులు పెట్టుబడి సాయానికి దూరమయ్యారు. వైఎస్‌ఆర్‌సీపీ పాలనలో వైఎస్సార్‌ రైతుభరోసా కింద 2023-24 సంవత్సరంలో పెట్టుబడిసాయం పొందిన రైతుల సంఖ్యతో పోలిస్తే ఇప్పుడు 23,574 మంది రైతులకు మొండిచేయి చూపుతుండటం గమనార్హం.

కౌలుదారులకు అన్నదాత సుఖీభవ లేనట్లే..

గత వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం కౌలు రైతులు, ప్రభుత్వ భూములు, ఎండోమెంట్‌ భూములు, అటవీ భూముల (ఆర్‌వోఎఫ్‌ఆర్‌)ను అనుభవిస్తున్న రైతులందరికీ వైఎస్సార్‌ రైతుభరోసా అమలు చేసింది. కూటమి ప్రభుత్వం మాత్రం కౌలు రైతులు, ప్రభుత్వ భూములు, ఎండోమెంటు భూములు, అటవీ భూముల (ఆర్‌వోఎఫ్‌ఆర్‌)ను అనుభవిస్తున్న రైతులందరికీ మొండిచేయి చూపుతోంది. 2025-26 సంవత్సరానికి జిల్లాలో 25వేల సీసీఆర్‌సీ కార్డులు జారీ చేయాలనేది లక్ష్యం. ఇప్పటి వరకు 10 వేల వరకు సీసీఆర్‌సీ కార్డులు జారీ అయ్యాయి. అన్నదాత సుఖీభవ కింద ఒక్క కౌలుదారుకు కూడా పెట్టుబడి సాయం అందని పరిస్థితి.

కొత్త రైతులకు అందని పీఎం కిసాన్‌ సాయం

ఐదేళ్లలో వేలాది మంది కొత్త రైతులు వ్యవసాయంలోకి అడుగుపెట్టారు. భూములను కొనుగోలు చేయడం ద్వారా పట్టాదారు పాసుపుస్తకాలు కూడా జారీ అయ్యాయి. అయితే వీరికి పీఎం కిసాన్‌ సాయం అందని పరిస్థితి. 2019 ఫిబ్రవరి 1లోపు పట్టాదారు పాసుపుస్తకాలు కలిగిన రైతులకు మాత్రమే పీఎం కిసాన్‌ సాయం అందుతోంది. 2019 ఫిబ్రవరి 1 తర్వాత కనీసం 50 వేల మంది భూములు కొనుగోలు చేయడం ద్వారా వ్యవసాయంలోకి అడుగుపెట్టారు. వీరంతా తమకు కూడా పీఎం కిసాన్‌ సాయం వర్తింపజేయాలని కోరుతున్నారు.

దగాపడిన రైతన్న

2024 ఎన్నికల సమయంలో పీఎం కిసాన్‌తో సంబంధం లేకుండా రూ.20 వేల పెట్టుబడి సాయం అందిస్తామని ప్రకటించిన చంద్రబాబు ఇప్పుడు పీఎం కిసాన్‌తో కలిపి ఇస్తుండటం పట్ల ఆందోళన వ్యక్తమవుతోంది. కుటుంబంలో ఎంతమందికి భూములు ఉంటే అందరికీ పెట్టుబడి సాయం అందిస్తామని రైతులను మభ్య పెట్టారు. ఇప్పుడు కుటుంబం యూనిట్‌గా అమలు చేస్తుండటం చంద్రబాబు రెండు నాల్కల ధోరణికి అద్దం పడుతోంది.



పీఎం కిసాన్‌లో భారీగా కోత

- పీఎం కిసాన్‌ సమ్మాన్‌ నిధి(పీఎం కిసాన్‌) కింద కేంద్రం రైతులకు 19వ విడత ఆర్థిక సాయాన్ని ఆగస్టు 2న రైతుల బ్యాంకు ఖాతాలకు విడుదల చేయనుంది.
- 18వ విడతతో పోలిస్తే 19వ విడతలో ప్రయోజనం పొందిన రైతుల సంఖ్య తగ్గింది.
- 19వ విడతతో పోలిస్తే 20వ విడతలో లబ్ధిదారుల సంఖ్య మరింత తగ్గడం ఆందోళన కలిగిస్తోంది.
- 18వ విడతలో 2,45,252 మంది రైతులకు లబ్ధి చేకూరగా.. 19వ విడతలో ఆ సంఖ్య 2,42,934కు తగ్గింది.
- 20వ విడతలో ఏకంగా 2,38,693కు తగ్గిపోవడం గమనార్హం.
- మొత్తం 4,241 మంది రైతులకు మొండి చేయి చూపడం పట్ల ఆందోళన వ్యక్తమవుతోంది.



'గాలేరు'కు నీరు విడుదల
పాణ్యం: గోరుకల్లు జలాశయం నుంచి జీఎన్‌ఎస్‌ఎస్‌ (గాలేరు-నగరి సుజల స్రవంతి)కాల్వకు అధికారులు నీటిని విడుదల చేశారు. బుధవారం జీరో పాయింట్‌ వద్ద ఈఈ శివప్రసాద్‌ పూజలు చేసి స్విచ్‌ ఆన్‌ చేసి నాలుగు గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గోరుకల్లు బ్యాక్‌ వాటర్‌ను గాలేరునగరి కాల్వ ద్వారా అవుకు జలాశయానికి పంపుతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం 5వేల క్యూసెక్కులకు మొదలుకొని 8వేల క్యూసెక్కుల వరకు నీటిని పంపుతున్నట్లు చెప్పారు.

పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసుకోండి

- బ్యాంకర్లకు ఎస్పీ సూచన



మాట్లాడుతున్న ఎస్పీ విక్రాంత్‌ పాటిల్‌



పాల్గొన్న పోలీసు, బ్యాంకు అధికారులు

కర్నూలు: జిల్లాలోని అన్ని బ్యాంకులు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసుకోవాలని ఎస్పీ విక్రాంత్‌ పాటిల్‌ బ్యాంకర్లకు సూచించారు. బుధవారం ఆయన జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్‌ ఆడిటోరియంలో జిల్లాలోని అన్ని బ్యాంకుల మేనేజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇటీవల మధ్యప్రదేశ్‌, మహారాష్ట్ర, తమిళనాడు, హర్యానా వంటి రాష్ట్రాల్లో హైవే పక్కన ఉన్న బ్యాంకుల్లో జరిగిన దొంగతనాలను ఈ సందర్భంగా గుర్తు చేశారు. అనంతరం మాట్లాడుతూ బ్యాంకు లోపల, బయట మన్నిక కలిగిన సెన్సర్‌ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. బ్యాంకుల్లో దొంగలు పడిన వెంటనే బ్యాంకు వారికి మెసేజీలు, అలర్ట్స్‌ వచ్చేలా భద్రత చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి బ్యాంకులో సెక్యూరిటీ గార్డు ఉండాలన్నారు. కొందరి ఖాతాల్లో పెద్ద మొత్తాల్లో లావాదేవీలు జరిగినప్పుడు బ్యాంకు అధికారులు అప్రమత్తంగా ఉంటూ సైబర్‌ నేరగాళ్ల గురించి ఖాతాదారులను అప్రమత్తం చేయాలన్నారు. జిల్లాలోని పోలీసు అధికారులందరూ బ్యాంకులను సందర్శించి సెక్యూరిటీ పరంగా తీసుకోవలసిన జాగ్రత్తలపై చర్చించాలన్నారు. కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్‌, ఎస్‌బీఐ మేనేజర్‌ అబ్దుల్‌ రవూఫ్‌, కరూర్‌ వైశ్య బ్యాంక్‌ అధికారి పీరయ్య, సీఐలు తేజమూర్తి, రామయ్య నాయుడు, నాగరాజ రావు, శ్రీధర్‌, విక్రమ సింహ, చంద్రబాబు నాయుడు, మన్సూరుద్దీన్‌, నాగశేఖర్‌, సైబర్‌ ల్యాబ్‌ అధికారి వేణుగోపాల్‌, సిబ్బంది పాల్గొన్నారు.


అవ్వ బ్యాంకు మాజీ సీఈఓ అరెస్ట్‌
ఆదోని అర్బన్‌: ఫోర్జరీ డాక్యుమెంట్లతో రూ.3.24 కోట్ల రుణం పొందేందుకు సహకరించిన మహాయోగి లక్ష్మమ్మవ్వ బ్యాంకు మాజీ సీఈఓ గట్టు మురళీకుమార్‌ను బుధవారం అరెస్టు చేసినట్లు ఆదోని వన్‌టౌన్‌ సీఐ శ్రీరామ్‌ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ తెలిపిన వివరాలివీ.. మహాయోగి లక్ష్మమ్మవ్వ కోఆపరేటివ్‌ బ్యాంకులో సీఈఓగా పనిచేస్తున్న గట్టు మురళీకుమార్‌ పారిశ్రామికవేత్త ఎల్లే మల్లేశప్ప, ఎల్లే చెన్నబసవ, ఎల్లే చైత్రలకు సంబంధించిన పొలం పట్టాను బ్యాంకులో తనఖా పెట్టి నాలుగేళ్ల క్రితం రూ.3.24 కోట్లు రుణం తీసుకున్నారు. ఇందుకు సంబంధించిన డబ్బు ప్రతియేడాది బ్యాంకు నిబంధనల మేరకు సకాలంలో చెల్లించకపోవడంతో బ్యాంకు యాజమాన్యానికి అనుమానం వచ్చింది. ఆ మేరకు డాక్యుమెంట్లను తిరిగి పరిశీలించారు. డాక్యుమెంట్లన్నీ ఫోర్జరీ కావడం, సంబంధిత సబ్‌రిజిస్ట్రార్‌ సంతకాలు, అందుకు సంబంధించిన సీల్‌ సైతం నకిలీవని గుర్తించిన బ్యాంకు చైర్మన్‌ రాయచోటి సుబ్బయ్య ఈ యేడాది మార్చి 29న పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. రుణగ్రహీతలకు మాజీ సీఈఓ గట్టు మురళీ కుమార్‌ సహకరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ మేరకు వారందరిపై కేసు నమోదు చేశామని, బుధవారం స్థానిక రాంజల రోడ్డులో మాజీ సీఈఓ గట్టు మురళీకుమార్‌ను అరెస్టు చేసినట్లు సీఐ వెల్లడించారు.



మోసం.. బాబు నైజం
ఎన్నికల సమయంలో హామీలిచ్చి, అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేయడం టీడీపీ అధినేత చంద్రబాబు నైజమని పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి విమర్శించారు. కృష్ణగిరి మండల పరిధిలోని ఎస్‌హెచ్‌ఓ ఎర్రగుడి గ్రామంలో బుధవారం 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సీఎం చంద్రబాబు చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించారు. -కృష్ణగిరి

రక్షిత నీరు.. 'లెస్‌' టెండర్‌ తీరు

- 40 శాతం లెస్‌కు ఆర్‌డబ్ల్యూఎస్‌ ఓఅండ్‌ఎం టెండర్లు
- 12 స్కీంలకు తొలగిన అడ్డంకులు
- అగ్రిమెంట్‌ చేసుకొని పనుల నిర్వహణను చేపట్టిన కాంట్రాక్టర్లు
- నష్టానికి నీటి సరఫరాపై అనుమానాలు
- చివరి గ్రామాలకు రక్షిత నీరు ప్రశ్నార్థకమే!



బాపురం రిజర్వాయర్‌

కర్నూలు(అర్బన్‌): ఎవరైనా వ్యాపారం చేసేది లాభం కోసమే, కానీ జిల్లా గ్రామీణ నీటి సరఫరా విభాగంలో మాత్రం నష్టానికి నీళ్ల వ్యాపారం చేస్తున్నారు. అధికారులు నిర్ణయించిన ధర కంటే 40 శాతానికి పైగా లెస్‌కు పనులను దక్కించుకున్నారంటే ఆయా పనుల్లో నాణ్యత ప్రశ్నార్థకం అవుతోంది. 10 శాతం లెస్‌కు టెండర్లు వేసుకోవడం సహజం. అయితే 25 శాతం వరకు లెస్‌కు వేసుకునేందుకు ప్రభుత్వ అనుమతి ఉంది. అయితే పలు పథకాలకు ఏకంగా 40 శాతానికి పైగా లెస్‌కు టెండర్లు వేసి అగ్రిమెంట్లు చేసుకున్నారు. ప్రస్తుతానికి పనులు దక్కించుకొని అధికార పార్టీ నేతల అండదండలతో ఏదో ఒక విధంగా మేనేజ్‌ చేయవచ్చనే ఆలోచనలతోనే కాంట్రాక్టర్లు అధిక శాతం లెస్‌కు వెళ్లి ఉంటారనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

ఆర్‌డబ్ల్యూఎస్‌ ఇంజినీర్ల ఆశ్చర్యం

జిల్లాలోని 351 గ్రామాలకు గ్రామీణ నీటి సరఫరా విభాగం ఆధ్వర్యంలో 33 మంచి నీటి పథకాల ద్వారా రక్షిత మంచి నీటిని అందించాల్సి ఉంది. ఈ స్కీంల నిర్వహణకు ప్రతి ఏటా రూ.49.29 కోట్లు ఖర్చు చేస్తున్నారు. తాగునీటి పథకాల నిర్వహణ, తాత్కాలిక మరమ్మతులు, సిబ్బంది జీతభత్యాలకు ఈ నిధులను వెచ్చించుకునే సౌలభ్యం ఉంది. ఈ పథకాలకు సంబంధించి టెండర్‌ విధానం ద్వారా కాంట్రాక్టర్లకు పనులను అప్పగిస్తున్నారు. అయితే ఆదోని డివిజన్‌లోని 16 మంచి నీటి పథకాల నిర్వహణకు సంబంధించి పలువురు టెండర్‌కు వ్యతిరేకంగా న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఇందులో 12 రిట్‌ పిటిషన్లకు సంబంధించి నామినేషన్‌ పద్ధతిన పనులను అప్పగించరాదని, టెండర్లు నిర్వహించిన వాటికి అగ్రిమెంట్‌ చేసుకుంటే తాము అడ్డుపడమని న్యాయ స్థానం గ్రీన్‌ సిగ్నల్‌ ఇచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే 12 స్కీంలకు అగ్రిమెంట్‌ చేసుకున్నారు. ఈ పనులకు సంబంధించి ఒకటి, రెండు మినహా మిగిలిన అన్ని పనులకు 25 శాతానికంటే అధికంగా లెస్‌కు వెళ్లి కాంట్రాక్టర్లు పనులు దక్కించుకున్నారు. 40 శాతం లెస్‌కు పనులు దక్కించుకోవడంపై ఆర్‌డబ్ల్యూఎస్‌ ఇంజినీర్లే ఆశ్చర్యాన్ని వ్యక్తం చేస్తున్నారు. చివరి వరకు ఆయా స్కీంల నుంచి నిర్దేశించిన గ్రామాలకు రక్షిత నీటిని అందించగలరా? అనే అనుమానాలను వారు వ్యక్తం చేస్తున్నారు. కాగా, కొన్ని గ్రామాలకు రెండు నుంచి నాలుగు రోజులకు ఒకసారి, మరి కొన్ని గ్రామాలకు ఆయా గ్రామాల్లోని సోర్సులను అనుసరించి వారానికి ఒకసారి నీటిని విడుదల చేసే అవకాశాలు ఉన్నట్లు ఇంజినీర్లే చెప్పడం గమనార్హం.

- ఆదోని డివిజన్‌లోని పెసలబండ స్కీం నుంచి 21 గ్రామాలకు రక్షిత తాగునీటిని అందించాల్సి ఉంది. ఏడాది పాటు ఆయా గ్రామాలకు రక్షిత నీరు అందించేందుకు ఆపరేషన్‌ అండ్‌ మెయింటెనెన్స్‌ (ఓఅండ్‌ఎం) కింద రూ.81.21 లక్షలు వ్యయం అవుతుందని ఆర్‌డబ్ల్యూఎస్‌ అధికారులు అంచనాలు రూపొందించి టెండర్లను ఆహ్వానించారు. అయితే ఓ కాంట్రాక్టర్‌ 40 శాతం లెస్‌కు ఈ పనులను దక్కించుకున్నారు. పనుల్లో నాణ్యత ఏ విధంగా ఉంటుందో ఊహించుకోవచ్చు. ఏడాది పాటు చివరి గ్రామాల వరకు రక్షిత తాగునీటిని సరఫరా చేస్తారా? అనే అనుమానాలను ఇంజినీర్లే వ్యక్తం చేస్తున్నారు.
- విరుపాపురం స్కీం నుంచి 13 గ్రామాలకు రక్షిత నీటిని అందించేందుకు అంచనా విలువ రూ.21.60 లక్షలు కాగా, ఈ పనులను కూడా 31.76 శాతం లెస్‌కు దక్కించుకున్నారు. అలాగే కుప్పగల్‌ (40 శాతం), హెబ్బటం (40.15 శాతం), కౌతాళం (40.01 శాతం), సాతనూరు (40.01 శాతం), మందగిరి (40.01 శాతం) ఆస్పరి (35.46 శాతం), అల్వాల (36.90 శాతం), హానవాళు (28.59 శాతం) లెస్‌కు కాంట్రాక్టులను దక్కించుకున్నారు. కాగా.. రూ.114.46 లక్షల అంచనాతో 26 గ్రామాలకు నీరు అందించే బాపురం నీటి పథకం పనులను మాత్రం 23 శాతం లెస్‌కు దక్కించుకున్నారు.

చివరి గ్రామాలకు రక్షిత నీరు ప్రశ్నార్థకమే!

అంచనా విలువ కన్నా 40 శాతం లెస్‌కు పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు పూర్తి స్థాయిలో ఆయా స్కీంలను నిర్వహిస్తారనేది ప్రశ్నార్థకమేనని ఆ శాఖకు చెందిన ఇంజినీర్లే అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. లెస్‌కు అగ్రిమెంట్‌ చేసుకున్న నీటి పథకాలకు సంబంధించి దాదాపు 120కి పైగా గ్రామాల ప్రజలకు రక్షిత మంచి నీటిని అందించాల్సి ఉంది. అయితే అయితే అక్కడి ప్రజల అవసరాలకు అనుగుణంగా నీటిని విడుదల చేసి చేతులు దులుపుకుంటారేమో అనే అనుమానాలను కూడా వారు వ్యక్తం చేస్తున్నారు. కాగా, ఏ గ్రామానికి ఎంత నీరు సరఫరా చేశారో, ఆర్‌డబ్ల్యూఎస్‌ ఇంజినీర్లు క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఎం బుక్‌ రికార్డ్‌ చేసి బిల్లులను చేయాల్సి ఉంది. ఇందులో పారదర్శకత లోపిస్తే లెస్‌ టెండర్లకు ఫలితం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

'అడిషనల్‌' డిపాజిట్‌ ఇవ్వాల్సిందే



మంచి నీటి పథకాల నిర్వహణకు సంబంధించి 25 శాతం వరకు లెస్‌కు టెండర్లు వేసుకునే సౌలభ్యం ఉంది. అయితే 25 శాతం కంటే అధికంగా లెస్‌కు వెళ్తే సంబంధిత కాంట్రాక్టర్‌ నుంచి అడిషనల్‌ సెక్యూరిటీ డిపాజిట్‌ను చేయించుకుంటాం. అగ్రిమెంట్‌ చేసుకున్నప్పటి నుంచి ఏడాది పాటు ఆయా స్కీంల నుంచి నిర్ణయించిన గ్రామాలకు రక్షిత మంచి నీటిని సరఫరా చేయాల్సిందే. ఎక్కడైనా పొరపాట్లు జరిగితే నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటాం.

– బీ నాగేశ్వరరావు, ఎస్‌ఈ, ఆర్‌డబ్ల్యూఎస్‌

క్లుప్తంగా

అహోబిలేశుడి సేవలో జైళ్ల శాఖ డీజీపీ



అహోబిలం ఆలయ ఆవరణలో డీజీపీ అంజనీకుమార్

ఆళ్లగడ్డ: అహోబిల లక్ష్మీ నరసింహ స్వామివార్లను జైళ్ల శాఖ డీజీపీ అంజనీకుమార్ బుధవారం దర్శించుకున్నారు. అహోబిలం చేరుకున్న ఆయనకు ఆలయ మర్యాదల్లో భాగంగా ప్రధానార్చకులు వేణుగోపాలన్ ఆధ్వర్యంలో పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అహోబిలం క్షేత్రంలోని లక్ష్మీనరసింహ స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు స్వామి వార్ల శేషవస్త్రం, ప్రసాదాలు అందజేసి వేదాశీర్వచనాలు అందించారు.

రేపు అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో ఆగస్టు 1న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి సుబ్బరత్నాలు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్–14, అండర్–16, అండర్–18, అండర్–20 విభాగాల్లో బాలబాలికలకు పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రతిభ చాటిన క్రీడాకారులు వచ్చే నెల 9 నుంచి 11వ తేదీ వరకు గుంటూరు జిల్లా బాపట్లలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సౌత్‌జోన్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు బర్త్ సర్టిఫికెట్ తీసుకురావాలని వివరాలకు 89194 09232 సెల్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

కుటుంబ కలహాలతోనే ఆత్మహత్య

కోవెలకుంట్ల: పట్టణంలోని నాగులకట్ట వీధిలో నివాసం ఉంటున్న పవన్‌నాయక్ (25) అనే యువకుడు కుటుంబ కలహాలతోనే ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. బుధవారం ఎస్‌ఐ తెలిపిన వివరాల మేరకు.. ఆళ్లగడ్డ మండలం బాచేపల్లితండాకు చెందిన పవన్‌నాయక్ పట్టణంలోని శ్రీరాం చిట్స్ కంపెనీలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ప్రసవ నిమిత్తం పుట్టింటికి వెళ్లిన భార్య ఇరవై రోజుల క్రితం ఆడబిడ్డకు జన్మనిచ్చింది. కుటుంబ కలహాలతో పవన్‌కుమార్ విరక్తి చెంది మంగళవారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతుడి సోదరుడు బాలస్వామినాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఎట్టకేలకు చిక్కిన కొండముచ్చు



బోనులో ఉన్న కొండముచ్చు

ప్యాపిలి: జలదుర్గం గ్రామంలో గత వారం రోజులుగా హడలెత్తించిన కొండముచ్చు ఎట్టకేలకు పట్టుబడింది. బుధవారం గ్రామాన్ని సందర్శించిన డీఎఫ్‌ఓ నాగమనేశ్వరి రెస్క్యూ టీం వారిని రప్పించారు. రాత్రి 10 గంటల సమయంలో చెట్టుపై ఉన్న కొండముచ్చును గుర్తించిన రెస్క్యూ టీం, అటవీశాఖ అధికారులు చాకచక్యంగా మత్తు ఇంజెక్షన్ ఇచ్చారు. కొద్దిసేపటికే కొండముచ్చు చెట్టుపై నుంచి కిందపడింది. వెంటనే బోనులో బంధించి అటవీ ప్రాంతానికి తరలించారు. దాదాపు 20 మందిని కరిచిన కొండముచ్చు కథ సుఖాంతం కావడంతో జలదుర్గం ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. అయితే గ్రామంలో మరో కొండముచ్చు ప్రజలపై దాడి చేసి గాయపర్చినట్లు గురువారం సోషల్ మీడియాలో వార్తలు చక్కర్లు కొట్టాయి. అటవీశాఖ అధికారులు ఈ విషయాన్ని ఖండించారు. అనవసరంగా వదంతులు సృష్టిస్తే సదరు వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

కోలాటం.. సంబరం

- గ్రామాల్లో చిన్నారులు, మహిళల ఆసక్తి
- 40 రోజుల పాటు శిక్షణ
- కోలాటం, జడకోపు వైపు మొగ్గు
- అంతరించిపోతున్న కళలకు ప్రాణం



బుక్కాపురంలో కోలాటం నేర్చుకుంటున్న చిన్నారులు

మహానంది: పండుగలు, జాతరలు వస్తే గ్రామాల్లో సందడి కనిపిస్తుంది. పండుగలైనా, ప్రతిష్టలైనా జరిగితే కోలాటం నృత్యం ప్రధాన ఆకర్షణగా నిలుస్తుంది. అందులో ప్రధానంగా వినిపించే 'బుజ్జి బుజ్జి గణపయ్యా.. బొజ్జ గణపయ్యా', 'శివుడే దేవుడని నేనంటే.. శివుడే దేవుడు కాదంటారు'. 'రఘుకులతిలకా రారా..నిన్నెత్తీ ముద్దులాడెదరా'. ఇలా ఆధ్యాత్మిక పాటలతో భక్తిభావం, 'వస్తానంటివో పోతానంటివో వగలు పలుకుతావే', 'కట్ట మీద పోయే అలకల సిలకా భలేగుంది బాలా', 'బాగుందమ్మ.. బాగుందమ్మ ఆరుబయటా' అనే సినీ, జానపద, సంప్రదాయ పాటలు వింటే మనసుకు ఆనందం, మానసిక ప్రశాంతత లభిస్తుంది. అదే ఆ పాటలకు చిన్నారుల కోలాటం నృత్యాలు తోడైతే మనసుకు ఎంతో హాయి కలిగిస్తుంది. ఆధునిక కాలంలో తీరిక దొరికితే చాలు చేతిలో మొబైల్ పట్టుకుని గేమ్స్ ఆడుతూ కాలాన్ని వృథా చేసే వాళ్లను ఎంతో మందిని చూస్తున్నాం. వాటి వల్ల సమయం వృథాతో పాటు శారీరక, మానసిక ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి. అయితే కాలానుగుణంగా వస్తున్న మార్పులలో భాగంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో సంప్రదాయ నృత్యాల వైపు చిన్నారులు మొగ్గు చూపుతున్నారు.

చిన్నారుల తల్లిదండ్రులు తమ పిల్లలకు కూచిపూడి, భరతనాట్యం, డ్యాన్స్‌తో పాటు కోలాటం, జడకోపు నృత్యాలు నేర్పిస్తున్నారు. వీటి వల్ల పిల్లలకు ఆరోగ్యం, మానసిక స్థైర్యం కలుగుతూ రాణిస్తున్నారు. మహానంది మండలం బుక్కాపురం గ్రామంలో సుమారు 40 మంది చిన్నారులు ప్రతి రోజూ రాత్రి రెండు గంటలకు పైగా సమయం కేటాయించి కోలాటం నేర్చుకుంటున్న తీరు స్థానికులను ఆకట్టుకుంటుంది. చిన్నారుల బుజ్జి బుజ్జి స్టెప్పులు గ్రామస్తులను అలరిస్తున్నాయి.

40 రోజుల శిక్షణ

వెలుగోడు మండలం బోయరేవుల గ్రామానికి చెందిన ఎస్.శివరామిరెడ్డి చిన్నారులతో పాటు పెద్దలకు కోలాటం నృత్యం నేర్పిస్తున్నారు. అందులో భాగంగా బుక్కాపురం గ్రామానికి చెందిన 40 మంది చిన్నారులతో పాటు కొందరు మహిళలు కోలాటం నేర్చుకుంటున్నారు. ప్రతి రోజూ గ్రామంలోని కాశినాయన ఆలయం వద్ద రాత్రి రెండు గంటల పాటు కోలాటం సాధన చేస్తారు. కోలాటంతో పాటు ఇటీవల ప్రాచుర్యం పొందిన జడకోపు ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. సమయం దొరికితే టీవీలు, మొబైళ్లకు అతుక్కుపోయే తమ పిల్లలు సంప్రదాయ కోలాటం నేర్చుకోవడం ఆనందం కలిగిస్తుందని తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. చిన్నారులు రెండు చేతులతో కోలాటం కర్రలు పట్టుకొని లయ, సంగీతానికి అనుగుణంగా ఏకకాలంలో కర్రల శబ్దం చేస్తూ నృత్యం చేస్తుండటం కనువిందుగా ఉందని తల్లిదండ్రులు మురిసిపోతున్నారు.



చాలా ఆనందంగా ఉంది

మా ఊర్లో అందరూ కోలాటం నేర్చుకుంటుంటే నేను నేర్చుకుంటానని మా అమ్మ, నాన్నను అడిగాను. వాళ్లు నాకు కోలాటం నేర్చుకునేందుకు మరింత ప్రోత్సాహం అందించారు. రోజూ ఇక్కడికి వచ్చి కోలాటం నేర్చుకుంటున్నాను. ఎంతో సంతోషంగా ఉంది. – **రిషిత, ఒకటో తరగతి, బుక్కాపురం**

మొదట్లో భయం.. ఇప్పుడు ఆనందం



ప్రతి రోజూ రాత్రి రెండు గంటల పాటు సమయం కేటాయించి కోలాటం నేరిస్తున్నారు. మంచి దేవుడి పాటలకు కోలాటం నృత్యం చేస్తుంటే ఎంతో సంతోషంగా ఉంది. అమ్మ, నాన్నల సహకారంతో గురువు శివరామిరెడ్డి ఆధ్వర్యంలో కోలాటం నేర్చుకుంటున్నాను. మొదట్లో కాస్త భయం, బిడియం ఉండేది. ఇప్పుడు కోలాటం నృత్యం బాగా చేస్తున్నాను. – **కె.ష్ణవి, ఐదో తరగతి**

కోలాటం నేర్పుతూ ఉపాధి



గత కొన్నేళ్లుగా కోలాటం, జడకోపు నేర్చుకున్నాను. పండుగలు, జాతరలు, ఉత్సవాలు జరిగితే అక్కడికి వెళ్లి ప్రదర్శనలు ఇస్తాము. ఇటీవల సంప్రదాయ నృత్యాలకు మంచి ఆదరణ కనిపిస్తోంది. ప్రకాశం, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఇప్పటి వరకు సుమారు 1200 మందికి కోలాటం నేర్పించాను. గ్రూపులో 40 మంది సభ్యులు ఉంటే కోలాటం నేర్పిస్తాను. ఇదే కోలాటం నృత్యం మా లాంటి ఎంతో మంది కళాకారులకు ఉపాధి కల్పిస్తుంది. ఆసక్తి ఉన్న వారు ఎవరైనా 96769 95547 సంప్రదించవచ్చు. – **ఎస్.శివరామిరెడ్డి, బోయరేవుల**

విద్యుత్ సమస్యలతో పరేషాన్

- మోడల్ స్కూల్ హాస్టల్ విద్యార్థినుల ఇక్కట్లు
- అండర్ గ్రౌండ్ కేబుల్ కావడంతో మరమ్మతుల్లో తీవ్ర జాప్యం



మోడల్ స్కూల్ విద్యార్థినుల హాస్టల్

బనగానపల్లె: పట్టణ సమీపంలోని రవ్వలకొండపై ఉన్న ఏపీ మోడల్ స్కూల్ బాలికల వసతి గృహానికి విద్యుత్ సరఫరా అస్తవ్యస్తంగా తయారైంది. తరచుగా నెలకొంటున్న విద్యుత్ సమస్యలతో విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. హాస్టల్‌లో 9వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు వంద మంది విద్యార్థినులు ఆశ్రయం పొందుతున్నారు. మోడల్ స్కూల్ పక్కనున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి సుమారు 120 మీటర్ల మేర అండర్ గ్రౌండ్ కేబుల్ వైర్ ద్వారా హాస్టల్‌కు విద్యుత్ సరఫరా అందిస్తున్నారు. భూమి లోపలి భాగంలో వైర్ తరచూ పాడైపోతూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. దీంతో హాస్టల్‌లోని విద్యార్థినులు అంధకారంలో ఉండాల్సి వస్తోంది. ఇటీవల 15 రోజుల పాటు విద్యుత్ సరఫరా లేక విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆ తరువాత నేలను తవ్వి కేబుల్ వైర్‌కు మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. ఈ పరిస్థితులు ఎన్నాళ్లంటూ విద్యార్థినుల్లో ఆవేదన వ్యక్తమవుతోంది. అలాగే విద్యుత్ లోఓల్టేజీ, హైఓల్టేజీ వల్ల హాస్టల్ గదుల్లోని సీలింగ్ ఫ్యాన్లు పాడైపోయాయి. వీటిని రిపేరుకు ఇచ్చినట్లు సిబ్బంది చెబుతున్నారు. ఈ నెల 23న ఇక్కడి హాస్టల్ వార్డెన్‌ను వెలుగోడుకు బదిలీ చేయగా, ఇక్కడికి మాత్రం ఎవరినీ నియమించలేదు. ఇక్కడ పనిచేసే ట్యూటరే పగలు, రాత్రి విధులు నిర్వహిస్తున్నారు. ఈ విషయంపై మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రామలక్ష్మిని వివరణ కోరగా బాలికల హాస్టల్‌కు విద్యుత్ సమస్య ఉన్నది వాస్తవమేనన్నారు. ప్రస్తుతం విద్యుత్ సరఫరా పునరుద్ధరించామన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ నుంచి హాస్టల్ వరకు స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా చేసేందుకు ఆ శాఖ అధికారుల ఎస్టిమేషన్ మేరకు రూ.2 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులు క్రెడిట్ కాగానే పనులు ప్రారంభిస్తామని చెప్పారు.

ఉరి వేసుకొని మహిళ ఆత్మహత్య

నంద్యాల(అర్బన్): కడుపు నొప్పి తాళలేక మహిళ ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన నంద్యాల మండలం పుసులూరు గ్రామంలో చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన మసుల్దార్ షాహీరా, మహబూబ్ బాషాకు 17 ఏళ్ల క్రితం వివాహం అయ్యింది. గత కొంతకాలంగా షాహీరా (40) కడుపు కొప్పితో బాధ పడుతోంది. ఈ క్రమంలో కడుపునొప్పి తీవ్రం కావటంతో బుధవారం తెల్లవారుజామున ఫ్యానుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

హత్యకేసు నిందితుడికి జీవితఖైదు

- సహకరించిన వ్యక్తికి ఏడేళ్ల జైలు శిక్ష



జైలు శిక్ష పడిన ముద్దాయిలతో పోలీసులు

నంద్యాల(వ్యవసాయం): బనగానపల్లెకు చెందిన న్యాయవాది హత్యకేసులో ఇద్దరు నిందితులకు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ మూడవ అదనపు జిల్లా జడ్జి అమ్మన్న రాజ బుధవారం తీర్పు వెల్లడించారని మహానంది పోలీసులు తెలిపారు. 2018లో న్యాయవాది బసవరాజు హత్యకేసులో నలుగురి ప్రమేయం ఉండగా మొదటి వ్యక్తి అనారోగ్యంతో హాజరు కాకపోవడం, నాలుగో వ్యక్తి చనిపోవడంతో మిగిలిన రెండవ నిందితుడు నాగరాజుకు జీవిత కాలం జైలు శిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా, మూడో నిందితుడు నాగేంద్రకు ఏడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.500 జరిమానా విధించారు. పోలీసుల సమాచారం ప్రకారం.. న్యాయవాది బసవరాజుకు ఒక కేసు విషయంలో బొడ్డు సుజాత అనే మహిళతో పరిచయం ఏర్పడి వివాహేతర సంబంధానికి దారి తీసింది. కొన్నేళ్లకు వారి మధ్య సంబంధం బెడిసికొట్టింది. ఈ క్రమంలో 2015లో సుజాత నంద్యాలకు వెళ్దామని బసవరాజును పిలిపించగా బనగానపల్లె నుంచి కారులో బయలుదేరారు. మార్గం మధ్యలో పాణ్యం వద్ద నాగరాజు సాయంతో కూల్‌డ్రింక్‌లో విషం కలిపి తాగించడంతో బసవరాజు మృతి చెందాడు. అదే కారులో నంద్యాలకు వచ్చి బి.కోడూరుకు చెందిన నాగేంద్ర సాయంతో మహానంది మండలం గోపవరం సమీపంలో మృతదేహాన్ని తగలబెట్టారు. ఈ ఘటనపై మరుసటి రోజు వీఆర్‌ఓకు సమాచారం అందడంతో మహానంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి విచారణ జరిపారు. ఈ కేసు బుధవారం తుది విచారణకు రాగా జడ్జి విచారణ జరిపి నేరం రుజువు కావడంతో ఇద్దరికీ జైలుశిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. దీంతో ఇద్దరు నిందితులను పోలీసులు జైలుకు తరలించారు.

ప్రధానోపాధ్యాయులే ప్రేరణాత్మక శక్తి

బండి ఆత్మకూరు: ప్రధానోపాధ్యాయులు పాఠశాలకు ప్రేరణాత్మక శక్తిగా ఉండాలని డీఈఓ పి.జనార్దన్ రెడ్డి సూచించారు. మండలంలోని పార్నపల్లి ప్రభాత్ కాలేజీలో జిల్లాస్థాయిలో ప్రైమరీ స్కూల్ హెడ్మాస్టర్లకు రెండవ లీడర్‌షిప్ రెసిడెన్షియల్ శిక్షణ కార్యక్రమం జరుగుతోంది.అకడమిక్ మానిటరింగ్ అధికారి మాధవీలత ఆధ్వర్యంలో మూడవ రోజు శిక్షణలో డీఈఓ పి.జనార్దన్ రెడ్డి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. పాఠశాలకు ప్రధానోపాధ్యాయులు ప్రేరణాత్మక శక్తిగా ఉండాలన్నారు. అందుకోసం ప్రతి ఒక్కరూ ఎల్లప్పుడూ ఆత్మ విశ్వాసం, నమ్మకం, ఆశాభావంతో ఉండి వ్యతిరేక పరిస్థితుల్లో కూడా శాంతియుతంగా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించినప్పుడే నాయకత్వ లక్షణాలు వస్తాయన్నారు. టీచర్లు, తల్లిదండ్రులు, విద్యార్థులతో సమన్వయం చేసుకుంటూ విద్యా ప్రమాణాలు మెరుగుపరిచే లక్ష్యాలను రూపొందించుకొని ముందుకెళ్లాలని సూచించారు. బండి ఆత్మకూరు మండల విద్యాశాఖ అధికారులు యశోద, మోహన్ రెడ్డి, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ జగన్‌మోహన్ రెడ్డి, సమగ్ర శిక్ష అభియాన్ డీటీపీ గాయత్రి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ అబ్దుల్ రఫీ, ఫిజికల్ డైరెక్టర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ యాంత్రీకరణపై సర్వే

కర్నూలు(అగ్రికల్చర్): కూటమి ప్రభుత్వం సర్వేల మీద సర్వేలు చేపడుతోంది. సచివాలయ సిబ్బంది తమ విధులను పక్కన పెట్టి పూర్తి సమయాన్ని సర్వేలకే కేటాయిస్తున్నారు. తాజాగా వ్యవసాయానికి సంబంధించి రైతుల వద్ద ఉన్న యంత్ర పరికరాలపై ప్రభుత్వం సర్వే చేపట్టనుంది. రైతు సేవా కేంద్రాల ఇన్‌చార్జ్‌లకు ఫారం మిషనరీ ఇన్వెంటరీ పేరుతో యాంత్రీకరణ సర్వేకు ఆదేశాలు ఇచ్చింది. ఇందుకు వ్యవసాయ శాఖ ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. ప్రతి రైతును సర్వే చేస్తారు. టార్పాలిన్‌లు, థైవాన్ స్ప్రేయర్లు మొదలుకొని ట్రాక్టరు వరకు అన్ని రకాల యంత్ర పరికరాల వినియోగాన్ని యాప్‌లో నమోదు చేస్తారు. ప్రభుత్వం సబ్సిడీపై సరఫరా చేసిన వాటితో పాటు రైతులు సొంతంగా సమకూర్చుకున్న వాటిని కూడా సర్వేలో నమోదు చేసుకుంటారు. ఎప్పుడు తీసుకున్నారు. కాలపరిమితి ఎంతవరకు ఉంది వంటివి కూడా యాప్‌లో నమోదు చేస్తారు. గ్రామస్థాయిలో యాంత్రీకరణ లభ్యతను బట్టి రానున్న రోజుల్లో ప్రభుత్వం సబ్సిడీపై యంత్ర పరికరాలు ఇచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం.

ప్రభుత్వ పథకాల పేరుతో సైబర్ మోసం

- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- ఎస్పీ విక్రాంత్ పాటిల్



కర్నూలు: ' ఇది ప్రభుత్వం ప్రారంభించిన కొత్త పథకం.. ఇప్పుడే దరఖాస్తు చేసుకోండి.. మీకు రూ.50 వేలు రాయితీ' అంటూ ఆకర్షించి సైబర్ నేరగాళ్లు మోసం చేస్తున్నారని ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. ప్రభుత్వ పథకాల పేరుతో వచ్చే తెలియని లింకులను క్లిక్ చేయవద్దని బుధవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. బ్యాంకు ఖాతాల ఓటీపీలు చెబితే మోసపోతారని హెచ్చరించారు. పీఎం కిసాన్, ముద్ర లోన్స్, సూర్య ఘర్, అమ్మఒడి తదితర పథకాల పేరుతో సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని, ఆయా పథకాలకు దరఖాస్తులు చేసుకునే వారిని ఎంచుకుని బురిడీ కొట్టిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇలాంటి మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ఆయా పథకాల పేరుతో మొబైల్‌కు వచ్చే తెలియని లింకులను క్లిక్ చేయవద్దని, ఓటీపీలు చెబితే కూడా మోసపోయే అవకాశముందని హెచ్చరించారు.

సూచనలు ఇవీ...

- ➡ ప్రభుత్వ పథకాలకు సంబంధించిన దరఖాస్తుల కోసం అధికారిక వెబ్‌సైట్లను మాత్రమే ఉపయోగించాలి.
- ➡ వ్యక్తిగత సమాచారం, బ్యాంకు ఖాతాల వివరాలు, ఓటీపీ, పాస్‌వర్డ్‌లను ఎవరితోనూ పంచుకోవద్దు.
- ➡ అపరిచిత కాల్స్ వస్తే 1930 నెంబర్‌కు కాల్ చేయాలి.
- ➡ అలాగే www.cybercrime.gov.inల లో ఫిర్యాదు చేయాలి.
- ➡ ప్రభుత్వ పథకాల సమాచారం కోసం www.gov.in,nic.in లాంటి అధికారిక డొమైన్లను మాత్రమే ఉపయోగించాలి.

బాలిక అదృశ్యం

నంద్యాల(అర్బన్): నంద్యాల మండలం బిల్లలాపురం గ్రామానికి చెందిన బాలిక శ్రీజనని (17) అదృశ్యమైనట్లు రూరల్ పోలీసులు బుధవారం తెలిపారు. మంగళవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లిన శ్రీజనని తిరిగి రాలేదని తల్లి మార్తమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అట్టహాసంగా సీపీఐ జిల్లా మహా సభలు



మాట్లాడుతున్న రామకృష్ణ

డోన్ టౌన్: డోన్ పట్టణంలో బుధవారం సీపీఐ నంద్యాల జిల్లా రెండవ మహాసభలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. నంద్యాల జిల్లా సీపీఐ కార్యదర్శి రంగనాయుడు ఆధ్వర్యంలో కొత్త బస్టాండ్ నుంచి పాత బస్టాండ్ వరకు డప్పు, కోలాటం, ప్రజానాట్యమండలి కళాకారులతో నృత్య ప్రదర్శనలు, జానపద గేయాలతో వేలాది మంది కార్యకర్తలతో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యకర్తలు ఎర్రదుస్తులు, జెండాలతో పాటు పట్టణంలోని ప్రధాన కూడళ్లలో సీపీఐ జెండా తోరణాలతో పట్టణం ఎరుపు మయంగా మారింది. అనంతరం బుగ్గన మార్గ్‌లోని రైల్వే స్టేషన్ వంద అడుగుల రోడ్డులో బహిరంగ సమావేశం నిర్వహించారు.

11 ఏళ్ల పాలనలో మోదీ చేసింది శూన్యం

ప్రధాన మంత్రి నరేంద్రమోదీ 11 ఏళ్ల పాలనల్లో ప్రజలకు చేసింది శూన్యం అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ఎద్దేవా చేశారు. 2014 ఎన్నికల మేనిఫెస్టోలో రైతులను ఆదుకుంటానని చెప్పి విస్మరించారన్నారు. గణాంకాల ప్రకారం 55 శాతం మంది రైతులు అప్పుల్లో కూరుకుపోయారని వివరించారు. పంటలకు గిట్టుబాటు ధర, ఉద్యోగాల కల్పన, బ్లాక్ మనీ వెనక్కు తెప్పిస్తామని చెప్పడం అన్నీ బూటకమని విమర్శించారు.

సీఎం సింగపూర్‌లో.. డీసీఎం సినిమాల్లో..

సీఎం చంద్రబాబు సింగపూర్ పర్యటనలో, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వీరమల్లు సినిమా పనుల్లో బీజీలో ఉన్నారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు అధికారంలో లేనప్పుడు కమ్యూనిస్టు పార్టీ చెప్పిన సిద్ధాంతాలు నిజం అంటూ గెలిచిన తరువాత సింగపూర్, డల్లాస్, లండన్ పర్యటనలు తప్పా చేసింది ఏమి లేదన్నారు. డబుల్ ఇంజిన్ సర్కార్ అంటూ డబుల్ అప్పులు చేశారని దుయ్యబట్టారు. ఏడాది పాలనలో 21 సార్లు ఢిల్లీ వెళ్లిన చంద్రబాబు రాష్ట్రానికి ఏమి చేశారని, రైతులకు నేటి వరకు ఒక్క పైసా ఇవ్వలేదన్నారు. ఎన్నికల సమయంలో చెప్పిన సూపర్ సిక్స్ పథకాలు అమలు చేసే వరకు కూటమి ప్రభుత్వాన్ని వదిలే ప్రసక్తి లేదని స్పష్టంచేశారు. స్వాతంత్ర్య పోరాటంలో పాలు పంచుకున్న సీపీఐ వంద వసంతాలు పూర్తి చేసుకుందని చెప్పారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, రామచంద్రయ్య, భీమలింగప్ప, బాబా ఫక్రుద్దీన్, నబిరసూల్, అవులశేఖర్, రజిత, లక్ష్మీదేవి, జిల్లా నాయకులు సుంకయ్య, రాధకృష్ణ, ప్రభాకర్ తదితరులు

జవానుకు అశ్రునివాళి



గాల్లోకి కాల్పులు జరిపి గౌరవ వందనం సమర్పిస్తున్న సిబ్బంది

- అధికార లాంఛనాలతో అంత్యక్రియలు



అశోక్‌కుమార్ (ఫైల్)

చాగలమర్రి: మండలంలోని పెద్దవంగలి గ్రామానికి చెందిన జవాను పోతినేని అశోక్‌కుమార్ భౌతిక కాయానికి బుధవారం అధికార లాంఛనాలతో అంత్యక్రియలు జరిపారు. ఆయన శ్రీనగర్‌లోని అనంతనాగ్‌లో ప్రత్యేక దళంలో ఎస్‌పీఆర్ ర్యాంకులో జవానుగా విధులు నిర్వర్తిస్తూ గుండెపోటుకు గురై మృతిచెందిన విషయం విదితమే. ఆయన భౌతిక కాయం బుధవారం ఉదయం చాగలమర్రికి చేరుకోగా మండల ప్రజలు స్థానిక టోల్‌ప్లాజా నుంచి మోటార్ సైకిళ్లపై జాతీయ జెండాను ప్రదర్శిస్తూ ర్యాలీగా స్వగ్రామమైన పెద్దవంగలికి తీసుకొచ్చారు. మృతదేహం ఇంటి వద్దకు చేరుకోగానే తల్లిదండ్రులైన పోతినేని శేఖర్, రామలక్ష్మీ, బంధువుల రోదనలు మిన్నంటాయి. గ్రామం శోక సంద్రంలో మునిగిపోయింది. తండ్రి పోతినేని శేఖర్ ఆర్మీలో పనిచేస్తుండగానే కుమారుడు మృతి చెందడం అందరినీ కలిచివేసింది. అనంతరం 203 ఇంజినీరింగ్ రెజిమేంట్‌కు చెందిన సుబేదార్ ఎం.కె.రెడ్డి, హవల్దార్ దర్గా రెడ్డి, ఏపీఆర్ శుభాష్, అలాగే 30(ఏ) ఎన్‌సీసీ బీఎన్ కడప జిల్లాకు చెందిన సూబేదార్ సునిల్‌మాలిక్, హవల్దార్ సీఎల్ రెడ్డి, వీకే చైతన్య జవాను భౌతిక కాయంపై పుష్పగుచ్ఛాలు ఉంచి వందనాలు సమర్పించారు. అనంతరం ప్రత్యేక దళ సిబ్బందిచే అంతిమ యాత్ర చేపట్టారు. శ్మశాన వాటికలో మృతదేహంపై జాతీయ జెండాను కప్పి గౌరవ వందనాలు సమర్పించారు. స్థానిక ఎస్‌ఐ సురేష్ ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా ఏఆర్ ఏఎస్‌ఐ మూర్తితో పాటు ఐదుగురు సిబ్బంది పాల్గొని పరేడ్ నిర్వహించి గౌరవ సూచకంగా గాల్లోకి కాల్పులు జరిపారు. మండలంలోని ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

దొర్నిపాడు: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని భాగ్యనగరం గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. రూరల్ సీఐ మురళీధర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. భాగ్యనగరం గ్రామానికి చెందిన రామాంజనేయులు (40), భార్య ప్రభావతమ్మ నిత్యం గొడవలు పడేవారు. రోజులాగే మంగళవారం రాత్రి వారి మధ్య ఘర్షణ జరిగింది. దీంతో ఇద్దరు కొడుకులను వెంట పెట్టుకొని ప్రభావతమ్మ వేరే ఇంటికి వెళ్లిపోయింది. ఈ స్థితిలో అతని తమ్ముడు నాగాంజనేయులు ఇంటికి వెళ్లి చూసేసరికి రామాంజనేయులు రక్తగాయాలతో మృతి చెంది పడి ఉండటం చూసి భయాందోళనకు గురయ్యారు. పోలీసులకు సమాచారం ఇవ్వగా రూరల్ సీఐ మురళీధర్‌రెడ్డి, ఎస్‌ఐ వరప్రసాద్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. నాగాంజనేయులు ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ సీఐ వెల్లడించారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ మురళీధర్‌రెడ్డి

భర్త చేతిలో భార్య హతం



మృతి చెందిన రామలక్ష్మి

కోసిగి: మండల పరిధిలోని చిన్నభూంపల్లి గ్రామానికి చెందిన బోయ దుద్ది రామలక్ష్మి (45)ను ఆమె భర్త నరసింహులు రోకలిబండతో తలపై కొట్టి హత్య చేశాడు. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. రామలక్ష్మి దంపతులు పిల్లలతో కలిసి బెంగళూరుకు వలస వెళ్లి జీవనం సాగించేవారు. నరసింహులకు కొద్దికాలంగా ఆరోగ్యం, మతిస్థిమితం సరిగా లేకపోవడంతో ఇటీవల మొహర్రం పండుగకు గ్రామానికి వచ్చి ఇక్కడే ఉంటున్నారు. క్రమంగా నరసింహులు పరిస్థితి దిగజారి ఇతరులతో మతిస్థిమితం లేకుండా ప్రవర్తించేవాడు. ఈ స్థితిలో బుధవారం సాయంత్రం రామలక్ష్మి ఇంటి ముందు వంట పాత్రలు తోముతుండగా నరసింహులు వెనుక నుంచి వచ్చి ఇంట్లో ఉన్న రోకలి బండతో తలపై కొట్టాడు. ఆమె తలకు తీవ్ర గాయమైంది. కుటుంబ సభ్యులు వెంటనే కోసిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా వైద్యులు పరిక్షించేలోపే ఆమె మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతదేహాన్ని గ్రామానికి తీసుకెళ్లారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

ఆదోని రూరల్: మండలంలోని పాండవగల్లు–కుప్పగల్లు గ్రామాల మధ్య బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అనంతపురం జిల్లా బొమ్మనహాళ్ మండలం కురువళ్లికి చెందిన శ్రీనివాసరెడ్డి, లక్ష్మి దంపతులు గాయపడ్డారు. వారు బైకుపై మంత్రాలయం మండలం సింగరాజనపల్లికి వెళ్తుండగా ఆర్టీసీ బస్సు వెనుక నుంచి తాకడంతో బైకు లారీని ఢీకొట్టి కింద పడ్డారు. ప్రమాదంలో భార్యాభర్తలిద్దరికీ గాయాలయ్యాయి. స్థానికులు వారిని ఆస్పత్రికి తరలించారు.

ఆటోలో నుంచి కింద పడి..: మండలంలోని బైచిగేరి వద్ద ఆటోలో వెళ్తున్న తమిళనాడు రాష్ట్రానికి చెందిన రాజు తాకూర్ ఆటోలో నుంచి కింద పడి గాయపడినట్లు తాలూకా ఎస్‌ఐ రామాంజనేయులు బుధవారం తెలిపారు. గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.